# జీవుని యిష్టము

(ఆంధ్రపత్రిక ఉగాది సంచిక : 1941)

**ఒ**క మారుమూల సముద్రంలో ఒక ద్వీపం ఉంది. ఆ ద్వీపం కూడా యెక్కడనో మారుమూల వుంది. ఓడల మీద సముద్రాలను నాగరకులు గాలించారు. అంత గాలించినా ఆ ద్వీపం ఒక పట్టాన కనుపించలేదు. నాగరకులు సర్వప్రపంచము. సముద్రపు నీళ్ళలో తేలిన ప్రతిమంటిగడ్డ తాము సాధించామని అనుకొన్న తరువాత ఆ ద్వీపం ఉన్నదని తెలుసుకునేందుకే కొన్నివేల యేండ్లు పట్టినవి. తెలుసు కోవడమే ఆలస్యం – మతాలు, వర్తకులు, తుపాకులు అక్కడకు చేరినవి. ఆ ద్వీపం కూడా డిటో ప్రకారం అయింది.

అయితే ఆ ద్వీపంలో వాళ్ళు ఇతర ప్రపంచంలో లొంగిపోయిన ఇతర ద్వీప వాసులకంటే కొన్నివేల సంవత్సరాలు ఎక్కువ స్వాతంత్రం అనుభవించారు. అందుచేత వాళ్ళు బానిసతనం అంత తేలికగా అలవాటు చేసికొనలేకపోయినారు. ఇతర చోట్లకు మల్లేనే అక్కడా తిరుగుబాట్లు, మరఫిరంగులు, కాల్పులు.

ఒక నాగరకజాతి సేనానాయకుడు ఆ ద్వీపానికి సైనిక నియంత. అతడు బ్రహ్మచారి. అనగా అవివాహితుడన్నమాట. ఆ ద్వీపం శీతమండలాల్లో ఉండడం మూలంగా అక్కడి జనులు తెల్లనివాళ్ళు, చర్మము తెల్లన. ఇతర ఖండములలోని అనాగరికుల వంటి వాళ్ళు, అనగా కోట్లకొలది సంవత్సరాలు బ్రతికిన జాతి అన్నమాట. చెట్టులో, పుట్టలో, సూర్యునిలో, మేఘములో నేదో దివ్యశక్తి యున్నదని దాని నారాధించినవాళ్ళు. మెఱుపును చూస్తూ జేజేలు పెడతారు. మిణుగురు పురుగులను చూచి తొలగిపోతారు. ప్రాణశక్తి వంటిది వాళ్ళకు మహాగౌరవము. ప్రాణాన్ని నేలక్రింద పడవేసి త్రొక్కరు. జీవుణ్ణి కాలిక్రింద పెట్టి నొక్కరు. బంగారము నాణెముగా వాడుకోరు. దానియందు తేజశ్శక్తి వున్నదని ఆరాధిస్తారు. కుండ పెంకులలో వండుకొని తింటారు. లోహపాత్రలు నాగరికత యని యెఱుగరు. శరీరావయములకు మాత్రము కావలసినంత కప్పుకొంటారు. నాగరికులై ఒళ్ళంతయు కప్పుకోరు. ఈ యనాగరకులు నాగరకులయ్యేరోజులు వచ్చి ఆ ద్వీపం నాగరికుల కంట బడ్డది.

సైనిక నియంత ఒక స్త్రీని చూశాడు. ఆమె అందం అతని కళ్ళకు పట్టరాకుండా వుండిపోయింది. ఆ సాయంత్రం ఆవిడ మొగుడికి కబురు పంపించాడు. "నీభార్యను తోలిపెట్టుమని" ఆ జీవుడు ఏమి చేస్తాడు? ఇది వఱకే తమ ద్వీపంలో జరిగిన ఘోరాలు అతనికి తెలుసు. అయినా జీవుడు పెనుగులాడటం స్వభావం. అది అన్యాయమని, తన ప్రాణం పోయినా తన భార్యను వదలిపెట్టనని కబురంపాడు. నియంతకు కోపం వచ్చింది. పదిమంది సైనికులు తుపాకులతో వాని యింటికి వెళ్ళారు. అతడు వీళ్ళు వస్తారని తెలిసి పొయ్యిలో పెట్టుకునే పొడుగాటి పుల్లలు తానొకటి, తన పెద్దకొడుకొకటి. చేతులలో పుచ్చుకొని తమ గుడిసెముందు నిలుచున్నారు. వారి యాయుధాలను వాళ్ళను చూస్తే నియంతకు నవ్వు వచ్చింది. అతడు "ఎందుకు నవ్వుతావు" అని అడిగాడు. నియంత ఇట్లా అన్నాడు. "ఓరి మూర్ఖుడా! మా తుపాకుల ముందు నీ కట్టె పుల్లలు నిలుస్తవా?" అని. అతడన్నాడు కదా "నా కట్టెపుల్ల నీ తుపాకులకు సమాధానము చెపుతవని కాదు నే నీ కఱ్ఱలు పుచ్చుకొన్నది. నా మనస్సు నీ మనస్సుకు సమాధానం చెప్పవలెనని గాని; మరొకదానికి గాదు" అని

నియంతకు కోపం వచ్చింది. ఒక కత్తి విసురుతో తండ్రి కొడుకుల తలలు తెగిపోయినవి. నియంత ఆ గుడిసెలో ప్రవేశించి అతని భార్యను తీసుకురాబోయినాడు. ఆరేండ్ల మొదలు చనుబాలు డ్రావే శిశువు వరకు నలుగురు పిల్లలు గుడిసెలో ఏడవ మొదలుపెట్టారు. ఆ స్త్రీ తన పిల్లలను వదలి రాలేకపోయింది. భర్త శవం కొడుకు శవం మీద పడి యేడవటం మొదలుపెట్టింది. సైనికులు శవాలను తీసుకొని పోయారు. సముద్రములో పారవేశారు. ఆమె యింక పిల్లల్ని పట్టుకొని యేడవడం మొదలుపెట్టింది. సైనికులు నియంత ఆజ్ఞతో పెద్ద పిల్లలను ముగ్గురినీ తల్లి చేతులలోంచి లాక్కుని పదిపదకొండుసార్లు విదిలించివేయగా వేయగా, వాళ్ళు దెబ్బ తగిలి, ఉస్సురని ప్రాణాలు కడపట్టి చనిపోయారు. ఆ స్త్రీ పాలు త్రావు పిల్లతో నియంత యింటికి వెళ్ళిపోయింది.

**(2)**

ఈ కథ జరిగి అయిదేళ్ళయింది. పాలుత్రాగే పిల్లకు అయిదేండ్లు వచ్చినవి. ఆ స్త్రీ పిల్లతో కాలం పుచ్చుతోంది. ఒకరోజున నియంత వచ్చాడు.

**నియంత** : ఆ పిల్ల గూడా పోతేగాని నీవు నాతో సరిగా వుండవు.

స్త్రీ : నీకన్న కర్కోటకుడు నీవే. నీవు మనుష్యుడవు కావు. ఈ పసిపిల్ల ప్రాణములు కూడా తీస్తావా?

**నియంత** : నిన్ను తీసుకు వచ్చినపుడు అది పసిపిల్ల. ఇప్పుడు పసిపిల్ల కాదే! దీని యీడు పిల్లలను నీ దగ్గరనుండి లాగివేయలేదూ? అట్లాగే ఇప్పుడును.

ఆ స్త్రీకి అతనితో అయిదేండ్లున్న తరువాత అతని యేమాటకు ఎంత అర్థమో తెలిసింది. ఆ పిల్లను తీసుకువెళ్ళి అతని చేతిలో పెట్టి యిదిగో ఈ పిల్లను చంపివేయి. ఈ పిల్ల వున్నన్నాళ్ళు నేను దానిని వదలిపెట్టలేను" అన్నది. ఆ పిల్లను ఆమె యెదుటనే కత్తితో రెండుగా నరికాడు. ఆమె యేడుస్తూ వెళ్ళిపోయింది.

**(3)**

ఆమె కొన్ని రాత్రులు ఉరిపోసుకుందామనుకుంది. పోసుకోలేదు.

ఆమె కొన్ని రాత్రులు సముద్రంలో పడి చద్దామనుకొంది. చావలేదు.

ఆమె కొన్ని రాత్రులు కిరసనాయిలు మీద పోసుకొని నిప్పు ముట్టించుకుందామనుకుంది. ముట్టించుకోలేదు.

ఇల్లా ఎన్నో అనుకుంది. ఏమీ చేయలేదు. తరువాత కొన్నాళ్ళకు ఒక రాత్రి నియంత తప్పత్రాగి మదించిన కళ్ళతో ఆమె వున్న గదిలోకి వచ్చాడు. "తనకు, దుఃఖానికి భేదము లేదు" అన్నట్లుగా ఉన్న ఆమెను చూశాడు. ఇట్లా అన్నాడు.

"నీ మగడు, నీ పిల్లలు పోయి పదేళ్ళయింది. నీ పసిపిల్ల పోయి అయిదేళ్లయింది.'

"నా ద్వీపపు స్వాతంత్ర్యం పోయి పాతికేళ్ళయింది."

**నియంత** : (వికారంగా నవ్వి) ఇంకా ఎన్నాళ్ళీ దుఃఖం?

"ఈ శరీరం వున్నన్నాళ్ళు"

"నీకు ఏమి తక్కువగా ఉంది? పూర్వం కన్న మంచిదుస్తులు ధరిస్తున్నావు. పూర్వం కన్న మంచి యింట్లో నివసిస్తున్నావు. పూర్వం కన్న మంచి భోజనం

చేస్తున్నావు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ జాతి కన్న నా జాతి గొప్పది. నీ భర్త కన్న నేను గొప్పవాడను"

"నీవు నా భర్త కన్న గొప్పవాడవు కావు"

**నియంత** : (కోపముతో) కానా? ఎట్లు కానో చెప్పుము.

స్త్రీ : మీకు తుపాకులున్నవి. కత్తులున్నవి. ఆయన తన భార్యను, పిల్లలను రక్షించుకునేందుకు నాభర్త కట్టుపుచ్చుకొని నిలబడ్డాడు. రక్షించలేనని తనకు తెలుసు. అయినా తన ధర్మం తాను చేశాడు. తాను చచ్చిన దరువాత గాని నిన్ను నా దగ్గరకు రానీయలేదు. నేను నిజముగా నీ భార్యనై ఉంటే నీ కన్న బలవంతుడు నాకోసం వస్తే నీవు పాఱిపోయేవాడవు. నీవు వట్టి పిఱికిపందవు.

**నియంత** : (కోపముతో) నేను పిఱికిపందను కాను.

స్త్రీ : నీవు పిఱికిపందవని నాకానాడే తెలియును. నీవు ధైర్యస్థుడవైనచో నింకొక కట్టుపుచ్చుకొని అతని నెదిరించెడివాడవు. అంతమంది సైనికుల నేల తెత్తువు?

**నియంత** : (నవ్వి) అయినచో ఆ చచ్చు వెధవను నేను కఱ్ఱపుచ్చుకొని యెదిరించలేక పోతిననియా నీ యుద్దేశం?

స్త్రీ : అతను చచ్చిపోయినాడు. నీ మాటకు రుజువేమున్నది? ఇప్పుడు నీ ధైర్యాన్ని నీవు నాకు రుజువుపరచలేవు. నిజంగా నీవు ధైర్యస్థుడవే అయితే అప్పుడలా చేసి వుండవు.

**నియంత** : నాకు ధైర్యము లేకపోవుటకాదు. నాకప్పుడీ తెలివి లేకపోయింది.

స్త్రీ : మా జాతిలో తెలివికీ, ధైర్యానికీ ఎక్కువ భేదం లేదు. మా న్యాయమే తెలివి. తెలివే ధైర్యం.

**నియంత** : మఱి యిటువంటి వాడితో నాతో నీవు సంసారం ఎందుకు చేస్తున్నావు?

స్త్రీ : నేను సంసారం చేయుటలేదు.

**నియంత** : ఈ మాటలు వింటే యెవరైనా నిన్ను మూఢురాల వనుకొంటారు.

స్త్రీ : నేను వాళ్ళను మూఢులనుకొంటాను.

**నియంత** : అయితే నీకు నాతో వుండటం ఇష్టం లేదన్నమాట.

స్త్రీ : లేదని నీతో చెప్పుట యిది ఎన్ని లక్షలోసారి?

**నియంత** : నీవు నన్ను ప్రేమించుట లేదని నాకు తెలుసు. నీ ప్రేమను నేను సాధుమార్గాన సాధించవలసింది. అప్పుడు ప్రేమించేదానవు.

"నీజాతి అంతా నశించిన తరువాత నిన్ను ప్రేమిస్తాను"

"నిన్ను చంపేస్తాను"

"పదియేండ్ల నుండి అల్లా చేస్తావేమో అని యెదురుచూస్తున్నాను."

"నీకు చావంటే అంత యిష్టమా?"

"అంతా యింతా యిష్టమా?"

"అయితే చావడానికి మార్గాలు లేవా?"

"ఉన్నవి"

"అయితే ఎందుకు చావవు? సముద్రములో పడి చావవచ్చు. ఉరిపోసుకుని చావవచ్చు

"నాకల్లా చావడం యిష్టం లేదు"

"ఎట్లా చావడం యిష్టం?"

"నీకు కోపం తెప్పించి నువ్వు నన్ను చంపితే చావాలని"

"అంటే నీకు నామీద ప్రేమ ఉన్నదన్నమాట"

"అవును. వుంది. ఆ ప్రేమ యెల్లాంటిదంటే – నా భర్త నా పిల్లలు నీచేతి మీదుగా చచ్చారు కనుక అల్లా నీ చేతి మీదుగానే చద్దామన్నంత ఆశ."

"ఈ మాటలకేమి గాని నీకు చావడానికి యిష్టం లేదు"

"చాలా పొరపాటు.చావడానికి యిష్టం ఉన్నది. కాని చావు రెండు రకాలు. ఒకటి తనంతట తాను చచ్చేచావు. రెండవది యెదుటివాళ్ళు చంపితే చచ్చేచావు. నాకు రెండవ చావే యిష్టం"

"అంటే నాతో కలిసి సుఖించడం యిష్టమన్నమాట"

"నిన్ను పదేండ్ల నుండి ఎఱుగుదును. నీవు పశువవు. నీ నాగరికత అంతా నీవు చేసే సురాపానంలో, నీవు ధరించే దుస్తుల్లో, నీ చేతిలో వున్న తుపాకీ మందులో వుంది. నీ మనసులో లేదు. నీ జాతిలో లేదు. నీ సృష్టిలో లేదు. నిన్ను నేను ప్రేమించడం లేదు. నీవు మనుష్యుడవే కాదు. నేను బ్రతుకుతున్నా

నన్న విషయం నీకాశ్చర్యంగా వుంది. నేను ఉరిపోసుకునో సముద్రంలో పడో చావడం నా జీవుడికి యిష్టం లేదు. నా జీవుడు ఈ శరీరాన్ని పట్టుకున్నాడు. వాడంతట వాడు వదలిపోడు. నా చనిపోయిన భర్తకోసం పిల్లలకోసం, గుండె అటమటించి చావడం, మహాగ్నిజ్వాలలలో మ్రగ్గిపోవడం ఈ జీవుడికి యిష్టం. ఈ జీవుడికి యిదియొక అనుభవం. ఆ జీవుడు తనంతట తాను చచ్చిపోడు. చచ్చిపోవడానికి యిష్టపడడు. సౌఖ్యమనుభవిద్దామని కాదు. దుఃఖమనుభవిద్దామనీ కాదు. సౌఖ్యమో, దుఃఖమో యీ శరీరంతో పుట్టి యీ శరీరానికి సంబంధించి అనుభవించటమే అతనికిష్టం. ఈ శరీరానికీ యీ జీవునికీ ఒక యెడతెగరాని లంకె. ఈ శరీరంతో ఈ జీవుడికి యిష్టమైన అనుభవము వాడు అనుభవించు కొంటాడు. మరి యీ శరీరంతో నేను నీతో సంసారం చేస్తున్నాను. గనుక అదీ వాడి యిష్టమే ననుకుంటావు కాబోలు. అల్లా కాదు. నా అంతట నేను చావటం నాకిష్టం లేదు. నీవు చంపితే చచ్చిపోవడం చాల యిష్టం. మృత్యువు దాని అంతట అది వస్తే చావడం యింకా యిష్టం. అట్లాగే ఈ జీవుడు ఈ శరీరంతో తన యిష్టం వచ్చిన సౌఖ్యాన్ని అనుభవించాలనుకొంటాడు. ఇతరుల వల్ల బలవంతంగా చేయబడ్డ అనుభవం. అది వాడికి సౌఖ్యం కాదు. అది దుఃఖమైనా అనుభవించడం అతనికిష్టం."

"అయితే నీవు నాకక్కరలేదు"

"నేను నిన్నడుగలేదు"

"నిన్ను చంపుతాను"

"ఊరికే అనడమెందుకు?"

నియంత ఆమెను చంపెను. చనిపోతున్న ఆమె పెదవులమీద సంతోషపు నవ్వు తాండవించెను. ఆమె కొనయూపిరితో నిట్లనెను. "నీవు నీ జన్మలో చేసిన మంచి పని ఇదియొక్కటియే, నేను చనిపోవుచుంటిని కదా! నీవు తరువాత యేమి చేసెదవు?"

"మఱల నింకొక స్త్రీని సంపాదించెదను"

"నీకు తగినమాట. నీ జాతికి జీవుని యిష్టము తెలియదు."